క్లుప్తంగా

పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: వడ్డీ లేకుండా పన్ను చెల్లింపులకు వీలుగా సెలవు రోజులైన ఆది, సోమవారాల్లో కూడా యధావిధిగా నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి పన్ను బకాయిపై వడ్డీ జమ అవ్వడంతో పాటు, పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ముగియనున్న డ్వాక్రా బజార్

నెహ్రూనగర్: డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్(డ్వాక్రా బజార్) రేపటితో ముగియనుందని రాష్ట్ర చేనేత ఉత్పత్తుల కమిటీ సభ్యురాలు, డ్వాక్రా బజార్ నిర్వాహకురాలు కోట దేవకీదేవి కోరారు. బృందావన్‌గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌లో శనివారం స్టాల్స్‌ను ఆమె సందర్శించి మాట్లాడారు. డ్వాక్రా బజారు ఈ నెల 25వ తేదీతో ముగియనుందని చెప్పారు.

25 నుంచి తిరునాళ్లు

పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేటలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 25 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు కన్నసాని విజయ్ కుమార్ ప్రకటనలో తెలిపారు.

నేడు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సుదర్శిని కంటి ఆసుపత్రి, సుదర్శిని ఐ అండ్ విజన్ అసోసియేషన్ ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న ప్రముఖ కంటి వైద్య నిపుణులు, సుదర్శిని కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ గణేశుని రాజేష్ తెలిపారు. స్థానిక పాతగుంటూరు యాదవ హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతోందన్నారు. భారతదేశంలోనే అత్యాధునిక పరికరాలతో కూడిన సంచార కంటి ఆసుపత్రి బస్సులో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామన్నారు. కంటి శుక్లాలు, పొరలు, నీటి కాసులు, నల్లగుడ్డు సమస్యలు, బీపీ, షుగర్ వల్ల వచ్చే డయాబెటిక్ రెటినోపతి, ఇతర కంటి సమస్యలకు ఉచితంగా వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తారన్నారు. ఇతర వివరాలకు 9395561919, 9885322617 నంబర్లకు సంప్రదించాలన్నారు.

3న ఉచిత సామూహిక ఉపనయనాలు



గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 3న ఉచిత సామూహిక ఉపనయనాలు చేస్తున్నట్లు సేవాసమితి కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ చెప్పారు. ఈమేరకు శనివారం స్థానిక బ్రాడీపేటలోని సేవా సమితి కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఉపనయనాలు చేయించుకునే వారు మార్చి 25న సాయంత్రం లోపు బ్రాడీపేట 1వలైనులోని బ్రాహ్మణ సేవాసమితి కార్యాలయంలో వటువు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. కేవలం బ్రాహ్మణులకు మాత్రమే ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కమిటీ కన్వీనర్ కర్లపాలెం బాలకృష్ణ 9440041241, కమిటీ కార్యాలయం 7013256879 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు పొత్తూరి మురళీమోహన్‌రావు, వి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు

పట్నంబజారు: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ ద్విచక్ర వాహనంపై రాజకీయ నాయకుల ఫొటోలు ఉన్న వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో నెహ్రూనగర్‌లో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో అతని వాహనంపై పవన్ కల్యాణ్ ఫొటో ఉంది. దీన్ని గమనించిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం నంబరు 5 అధికారి జి.సురేష్, సిబ్బంది నిలువరించగా, తన వాహనం వదిలి సదరు వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

పాత గుంటూరు: వస్తనగర్‌లో వేంచేసియున్న పద్మావతి గోదాదేవి సమేత కామ్యసిద్ధి వెంకటాచలస్వామి దేవస్థానం అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ 9 వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం సుప్రభాత సేవ, ప్రాతః కాలార్చన, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, పంచగవ్య ప్రాసన, అగ్నిధ్యానములు, నిత్యహోమం బలిహరణ, ధ్వజారోహనం, కుంభార్చన, హారతి, కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం, నవగ్రహఆరాధన, అగ్నిధ్యానములు నిత్యహోమం, బలిహరణ, నవగ్రహహోమం, కుంభార్చన, హారతి తదితర పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి ఎం.వి.శేషగిరిరావు, కమిటి సభ్యులు పర్యవేక్షించారు. వస్తనగర్ కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. ఇబ్బందులు తీరుస్తాం

- మద్దిరాల కాలనీ వాసులకు వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కిలారి రోశయ్య హామీ
- 57వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య, నూరిఫాతిమా

పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గం మద్దిరాల కాలనీలో రైల్వే భూముల్లో నివాసం ఉంటున్న ప్రజలకు బీఫారాలు అందజేసేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కిలారి రోశయ్య చెప్పారు. ఈమేరకు తూర్పు నియోజకవర్గంలోని 57వ డివిజన్ మద్దిరాల కాలనీ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమాతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటూ స్థానికులతో మాట్లాడుతూ ముందుకు సాగారు. ఈక్రమంలో స్థానికులు రైల్వే భూములకు సంబంధించి వారి సమస్యలను ఎమ్మెల్యే రోశయ్య, నూరిఫాతిమా దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ రైల్వే స్థలాల్లో స్థానికులు నివాసం ఉంటున్న క్రమంలో గత ఎంపీ మేలు చేస్తామని రైల్వే శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అండగా ఉంటామని చెప్పి తప్పించుకు తిరిగారని ఆరోపించారు. ఈ అంశంపై రైల్వే శాఖ అధికారులతో మాట్లాడి గుంటూరు కార్పొరేషన్‌కు సంబంధించిన భూములు వారికి అందజేసి స్థానికులకు మేలు జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు.

ఎన్నారై టూరిస్టులను నమ్మొద్దు

ఎన్నికల సమయంలో కేవలం పదవుల కోసం ప్రజలను మభ్యపెట్టే టీడీపీ ఎన్నారై టూరిస్టులను నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నూరిఫాతిమా ఎద్దేవా చేశారు. గతంలో రెండు సార్లు ఎంపీగా గెలిపించిన గల్లా జయదేవ్ కనీసం కనపడిన పాపాన పోలేదని, ఇప్పుడు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖరర్‌ను గెలిపించినా అదే పరిస్థితి జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అంటే నమ్మకానికి చిరునామా అని, పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా మంచికి ఓటు వేసిన వారవుతారని స్పష్టం చేశారు. మద్దిరాల కాలనీ వాసులకు ఖచ్చితంగా అండగా ఉంటామని, పదేళ్లలో ఎంపీగా గల్లా జయదేవ్ పట్టించుకోకపోయినా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కాలనీ వాసులకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పఠాన్ రిహానా, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు నూర్‌ఖాన్, పార్టీ నేతలు ఉష, మేరికుమారి, అమర్, అక్బర్, బషీర్, శ్రీనివాసరెడ్డి, సాగర్, సురేంద్ర, దుర్గారావు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలల తరువాత తల్లి ఒడికి చేరిన శిశువు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో బరువు తక్కువగా ఉందని శిశువును వదిలి వెళ్లిన తల్లి ఒడిలోకి ఐదు నెలల తరువాత శిశువును చేర్పించామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఐదు నెలల పాటు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సదరు శిశువు ఆలనా, పాలనా చూసుకున్నట్లు వెల్లడించారు. గత ఏడాది అక్టోబరు 21న అలేఖ్య జీజీహెచ్‌లో ఆడ శిశువును ప్రసవించిందన్నారు. బరువు తక్కువగా ఉండటంతో అలేఖ్య సహాయకురాలు లక్ష్మీ పిల్లల వైద్య విభాగానికి శిశువును తీసుకొచ్చిందన్నారు. చిన్న పిల్లల వైద్యులు శిశు ఆరోగ్య పరిస్థితి గురించి కౌన్సిలింగ్ ఇచ్చే సమయంలో లక్ష్మీని పిలువగా ఆమె వైద్యులకు సమాచారం ఇవ్వకుండా శిశువును వదిలి ఆసుపత్రి నుంచి వెళ్లిపోయిందన్నారు. శిశువు తల్లి రాకపోవడంతో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. అక్టోబరు 21 నుంచి ఐదు నెలల పాటు తల్లి శిశువు వద్దకు రాకపోవడంతో పిల్లల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది శిశువు ఆలనా పాలనా చూసుకున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డు ద్వారా శిశువు తల్లిని గుర్తించి కొత్తపేట పోలీసులు ఆమె నరసరావుపేటలో ఉన్నట్లు విచారణలో తెలుసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. పోలీసుల సమక్షంలో శిశువును తల్లికి అప్పగించామన్నారు. శిశువు ఆలనాపాలనా చూసుకున్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ రవీంద్ర నాయక్, పీజీ వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందించారు.



శిశువును తల్లికి అప్పగిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, పలువురు వైద్యులు

జలబిందెలతో.. ఊరేగింపుగా..



స్థానిక పాతగుంటూరు సుద్దపల్లి డొంకలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఆలయంలో విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలను ప్రారంభించి విశేష పూజలు అమ్మ వారికి నిర్వహించారు. సాయంత్రం మహిళలతో జలబిందెల ఊరేగింపు, మంగళ స్నానాల కార్యక్రమం వైభవంగా జరిగింది. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ఊరేగింపుగా కనకతప్పెట్లతో బావినీరు పోసి అమ్మవారికి మంగళ స్నానం చేయించారు. నేడు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామివారి కళ్యాణ మహోత్సవం రాత్రి 8.46 గంటలకు జరుగనుంది. సోమవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయం వద్ద చేపట్టనున్నారు. కార్యక్రమంలో కమిటి సభ్యులు రాము, పి.మహేష్, కె.పున్నారావు, కోటేశ్వరరావు, కృష్ణ, చిన్నబోయిన వెంకటేశ్వరరావు, వాసు, కె.శ్రీనివాసరావు, రాచకొండ బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

-పట్నంబజారు

వైభవంగా శ్రీవారి రథోత్సవం

పాత గుంటూరు: బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. విష్వక్సేన ఆరాధన, సామూహిక, విష్ణు, లలితా సహస్రనామ హనుమాన్ చాలీసా పారాయణములు నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో డాక్టర్ కోగంటి శ్రీరంగనాయకి, యం.వి. సత్యవతి నిర్వహణలో 500 మంది సువాసినీలతో పూజ, వేదపండితుల ఆధ్వర్యంలో చండీ హోమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. విశ్వగురు పీఠాధిపతులు భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. సభలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.జి. శంకర్, విజ్ఞాన్ విద్యాసంస్థలు అధినేత లావు రత్తయ్య, డాక్టర్ నిమ్మల శేషయ్య, బీజేపీ నాయకులు యడ్లపాటి స్వరూపరాణి, కార్పొరేటర్ మానం పద్మశ్రీ సాహితీవేత్తలు నిష్టల సుబ్రహ్మణ్యశాస్త్రి, నోరి నారాయణమూర్తి, కంచిపీఠ ప్రతినిధి కంభంపాటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



నగరోత్సవంలో పాల్గొన్న విశ్వంజీ మహరాజ్, భక్తులు

వీరుల స్మరణ మనందరి కర్తవ్యం



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సుధాకర్, హైకోర్టు న్యాయవాది వైకే

గుంటూరు ఎడ్యుకేషన్: దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను స్మరించుకోవడం మన కర్తవ్యమని దేశభక్త ప్రజా తంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా కన్వీనర్ డి.సుధాకర్ పేర్కొన్నారు. శనివారం ముగ్గురు అమరవీరుల 93వ వర్ధంతి సందర్భంగా పీడీఎం ఆధ్వర్యంలో కొత్తపేటలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లకు విప్లవ నివాళులర్పించారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ బ్రిటీషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అమరులైన వారిలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు ప్రముఖులని, వారి త్యాగాలు మరువలేనివన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో అతి చిన్న వయసులో ఉరి కొయ్యలను ముద్దాడి అమరులైన వారు కలలు గన్న సమ సమాజాన్ని నేటికీ పాలకులు అమలు చేయడం లేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం మనువాదాన్ని ముందుకు తెచ్చి నిచ్చెన మెట్ల వ్యవస్థను కొనసాగిస్తు దేశంలోని సంపదలను విదేశీయులకు, పెట్టుబడిదారులకు కారు చౌకగా అప్పగిస్తూ, ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేసి సాధించుకున్న ప్రభుత్వ కంపెనీలను సైతం పెట్టుబడిదారులకు అమ్మి వేస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా యువతరం, ప్రజలు పోరాటం చేయాలన్నారు. సీనియర్ న్యాయవాది వైకే మాట్లాడుతూ భగత్ సింగ్ కోరుకున్న సమాజం కోసం, బహుజనులు అన్ని రంగాల్లో ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అగ్రకుల ఆధిపత్యాన్ని వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించి బహుజన రాజ్యం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో బత్తుల విల్సన్, దళిత ఉద్యమ వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంటా ప్రభుదాస్, నాయి బ్రాహ్మణ జేఏసీ నాయకుడు తాడికొండ నరసింహారావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పి. ప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

మన్నించు బో(బా)స్?



స్థానిక కొత్తపేటలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ముసుగు వేసిన నగరపాలక సంస్థ సిబ్బంది తీరుపై అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మండిపడ్డారు. ఎన్నికల నిబంధనలకు స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు సంబంధం లేదని, ఇలాచేయడం సిగ్గు చేటన్నారు. తక్షణమే అధికారులు సమరయోధుల విగ్రహాలకు ముసుగు తీసి వేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

-లక్ష్మీపురం

స్ఫూర్తిదాయకం భగత్‌సింగ్ బలిదానం

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు



భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

లక్ష్మీపురం: ప్రతి ఏటా మార్చి 23వ తేదీన భగత్ సింగ్ సుఖదేవ్, రాజగురు అమరులైన రోజని, మనదేశాన్ని రాజ్యాంగాన్ని, మతోన్మాద శక్తుల దాడుల నుంచి పరిరక్షించుకుని ఆధునిక భారతాన్ని నిర్మించుకోవడానికి మనమంతా కలిసి కట్టుగా కదులుదామని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక కొత్తపేట సెంటర్ వద్ద గల భగత్ సింగ్ 93వ వర్ధంతిని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, నడింపల్లి గురుదత్, భగత్‌సింగ్ సేవా సమితి కార్యదర్శి ఎం.వి.ఆర్.ఆర్.భరత్, మురళీకృష్ణ, అవధానుల హరి, ఇందు శేఖర్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రంలో గత వారంరోజుల నుంచి జరుగుతున్న విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాధర్‌కుమార్ మాట్లాడుతూ యువత కోసం ఏర్పాటు చేసిన ఇటువంటి నైపుణ్య శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధి చేపట్టేందుకు వీలుకలుగుతుందన్నారు. పండ్లు, కూరగాయలతో ఇంటి దగ్గరే నాణ్యమైన పదార్థాలతో ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చని తద్వారా ఉపాధిని పొందవచ్చన్నారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ యువత కోసం ఇంకా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను కేవీకే సమన్వయంతో చేపట్టటం జరుగుతుందన్నారు. శిక్షణ పొంది స్వయంగా వ్యాపారాలు చేసుకునేందుకు ఈ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

గంజాయి స్వాధీనం

పట్నంబజారు: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్‌లో స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. వ్యసనాలకు బానిసగా మారిన తేలూరి దశరథరామిరెడ్డి నల్లచెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో వ్యసనాలకు బానిసగా మారి గంజాయి విక్రయించేందుకు నిర్ణయించుకున్నాడు. గుంటూరు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో భారీగా గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు మణిపురం ఓవర్‌బ్రిడ్జి కింద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రతిభ కనబర్చిన ఎస్సై కె.తరంగిణి, ఏఎస్సై ఎం.ఆంథోని, హెడ్‌కానిస్టేబుల్ నక్కా రవి, కానిస్టేబుల్ కోటేశ్వరరావులను ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నిషికేష్ షరేకే అభినందించారు.

ఫార్మసీ రంగంలో విస్తృత అవకాశాలు

- ప్రొఫెసర్ ఎస్.రామచంద్ర శెట్టి
- హిందూ ఫార్మసీ కళాశాలలో సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామచంద్రశెట్టి

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ రంగంలో విద్యార్థులకు విస్తృత అవకాశాలున్నాయని బెంగుళూరులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.రామచంద్రశెట్టి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ''ఫార్మసీ వృత్తి పరిణామం-ప్రస్తుత స్థితి'' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రశెట్టి మాట్లాడుతూ బల్క్‌డ్రగ్, వ్యాక్సిన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, పరిశోధనల్లో చోటు చేసుకున్న నూతన పరిణామాలను గురించి వివరించారు. కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో పరిశోధనలు, నూతన ఔషధాల ఆవిష్కరణల దిశగా కళాశాలలు, వివిధ విశ్వ విద్యాలయాలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకోవాలని అన్నారు.

సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ దేసు బ్రహ్మ శ్రీనివాసరావు, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.